క్లుప్తంగా

పటేల్, వాజ్‌పేయి విగ్రహాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహాల ఏర్పాటుకు తగిన అనుమతులు ఇవ్వాలని బీజేపీ నేతలు నగర మేయర్ కావటి మనోహర్ నాయుడుని ఆయన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమర యోధుడు ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహాలు ఏర్పాటు చేయడం భావి తరాల వారికి ఎంతో స్ఫూర్తినిస్తుందన్నారు. గుంటూరు నగరంలో వారి విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. బీజేపీ నాయకులు వనమా నరేంద్ర కుమార్, ఈదర శ్రీనివాస రెడ్డి, మంత్రి సుగుణ, కోలా రేణుక, రమాదేవి, కన్నా రవి దేవరాజు, కంతేటి సాంబయ్య పాల్గొన్నారు.

రేపు వెంకటకృష్ణాపురంలో బజరంగ్ నేత్రజ్యోతి


అంబటి మురళీకృష్ణ

పెదకాకాని: బజరంగ్ ఫౌండేషన్ సామాజిక సేవా పరంపర కొనసాగిస్తూ నేత్ర జ్యోతి పేరుతో అంధత్వ సమస్య నివారణకు గ్రామీణ ప్రాంతాలలో ఉచిత నేత్ర వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్యసేవలు అందిస్తున్నట్లు బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ తెలిపారు. పెదకాకాని మండలంలోని వెంకటకృష్ణాపురం,దేవరాయబొట్లవారిపాలెం గామాల్లో బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం నేత్రజ్యోతి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సంక్షేమ సారథి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో రైతులు, రైతు కూలీలు, వెనుకబడిన వర్గాలు, దళిత, గిరిజన బడుగు బలహీన వర్గాలు ఎక్కువగా ఉన్న గ్రామాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ శిబిరం ద్వారా కంటి సమస్య ఉందని గుర్తించిన వారికి 7 రోజుల్లోగా కళ్లజోళ్లు అందిస్తున్నట్లు అంబటి మురళీకృష్ణ తెలియజేశారు.

తైక్వాండో చాంపియన్‌షిప్‌లో విద్యార్థుల ప్రతిభ



గుంటూరు ఎడ్యుకేషన్: తైక్వాండో చాంపియన్‌షిప్‌లో స్టెమ్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ భరత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం విద్యానగర్‌లోని స్టెమ్ స్కూల్లో జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో భరత్ రెడ్డి మాట్లాడుతూ ఈనెల 18,19వ తేదీల్లో తెనాలిలోని జేఎంజే కళాశాలలో జరిగిన 41వ సబ్ జూనియర్ ఆరో కాడిట్ ఇంటర్ జిల్లా స్థాయి తైక్వాండో చాంపియన్ షిప్–23 బాలికల విభాగంలో ఎస్‌కే సన రజత పతకం, కాడిట్ బాలికల విభాగంలో సీహెచ్ తనీష, ఎం.అక్షర కాంస్య పతకాలు సాధించినట్లు వివరించారు. అదేవిధంగా కాడిట్ బాలుర విభాగంలో పి.శశినిఖిల్, షేక్ అబ్దుల్ లుక్మన్ కాంస్య పతకాలు పొందారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు విద్యతో పాటు క్రీడలు, ఆత్మరక్షణకు సంబంధించిన కరాటే, తైక్వాండో సాధన చేయడం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జయశీల, ఉపాధ్యాయులు రమాదేవి, మోనికా పాల్గొన్నారు.

అధికారులపై టీడీపీ కార్యకర్తల దౌర్జన్యం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో ఉండవల్లి సచివాలయం–2లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమం జరుగుతున్న సమయంలో అధికారులు మాట్లాడుతుండా టీడీపీ కార్యకర్తలు వచ్చి అధికారులను అడ్డుకున్నారు. సమస్యలు ఏమైనా ఉంటే అర్జీ రూపంలో ఇస్తే సంబంధిత అధికారులకు తెలియజేస్తామని అధికారులు చెబుతున్నప్పటికీ వారి మాటలు పట్టించుకోకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యే ఆర్కేను దూషిస్తూ అక్కడ ఉన్న వారిని రెచ్చగొట్టే ప్రయత్నాలు చేశారు. అధికారులపై కూడా అనుచిత వ్యాఖ్య లు చేస్తూ రెచ్చిపోయారు. మా ప్రభుత్వం వస్తే మీ సంగతి తేలుస్తాం ఐదు నెలలు ఆగండి అంటూ అధికారులతో పాటు అక్కడకు వచ్చిన ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు. పోలీసులు వచ్చి టీడీపీ కార్యకర్తలను అడ్డుకుని అక్కడి నుంచి తరలించారు.

పొన్నెకల్లు ఉర్దూ పాఠశాల తనిఖీ

పొన్నెకల్లు(తాడికొండ): తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామంలోని మండల పరిషత్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలను ఉప తనిఖీ అధికారి ఎండీ ఖాసిం మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఆయన పదార్థాలను పరిశీలించి పలు సూచనలిచ్చారు. పుస్తకాలను పరిశీలించి వారితో మాట్లాడి సామర్థ్యాలను పరిశీలించారు. రానున్న సమ్మేటివ్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని, రికార్డులు పక్కాగా నిర్వహించాలని సూచించారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు

- వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా
- 15,17 డివిజన్లలో 'వై ఏపీ నీడ్స్ జగన్'



కార్యక్రమంలో మాట్లాడుతున్న నూరిఫాతిమా

పట్నంబజారు: పేదలకు అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్క సంక్షేమ పథకాన్ని చేరవేస్తున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా చెప్పారు. మంగళవారం నియోజకవర్గంలోని 15,17 డివిజన్‌ల పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని ఆరోపించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన బాధ్యతలు చేపట్టిన తరువాత పూర్తి స్థాయిలో అవినీతిరహిత పాలన సాగుతోందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలను నమ్ముకుని కేవలం వారిని నచ్చినవారికి మాత్రమే ప్రభుత్వ పథకాలు అందజేసిన పరిస్థితులు ఉన్నాయన్నారు. కానీ నేడు కుల, మత, రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. రాష్ట్రంలో టీడీపీ పరిస్థితి ఖాళీ అయిందని, ఖచ్చితంగా రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఫర్జానా, వైఎస్సార్ సీపీ నేతలు ఎం.సుధాకర్‌రెడ్డి, నన్నే, నూర్ అహ్మద్ షరీఫ్, అఫ్రూద్దీన్, యాదాల చిన్న, సలీం, హన్ను పాల్గొన్నారు.

56వ డివిజన్‌లో...

నెహ్రూనగర్: రాష్ట్రంలో కుల,మత, ప్రాంత, పార్టీల కతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని 56వ డివిజన్ కార్పొరేటర్ కనకదుర్గ, తూర్పు నియోజకవర్గం క్లస్టర్ – 4 అధ్యక్షుడు అగ్గిపెట్టి రాజు పేర్కొన్నారు. మంగళవారం రాత్రి 56వ డివిజన్ వెంకటాద్రి పేటలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద వర్గాలకు ప్రభుత్వ పథకాలు, సంక్షేమ పథకాలు అందాలన్నా తిరిగి వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. జేసీఎస్ ఇన్‌చార్జి చిలకా రమేష్, కన్వీనర్ మురికిపూడి రమేష్ గృహసారథులు మక్కెన భారతి, గూడూరి ప్రసాద్, సంపంగుల,వినుకొండ మరియమ్మ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సంక్షేమ పథకాలను వివరిస్తున్న కార్పొరేటర్ కనకదుర్గ, క్లస్టర్ ఇన్‌చార్జ్ అగ్గిపెట్టి రాజు

తగిన అనుమతులతోనే ప్రైవేటు వెంచర్లు


- నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటాం
- నగర కమిషనర్ కీర్తి చేకూరి


వెంచర్‌కు సంబంధించిన పత్రాలను పరిశీలిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రైవేట్ వెంచర్లు, లే అవుట్లు తగిన అనుమతులతోనే ఏర్పాటు చేసుకోవాలని, లేకుంటే పట్టణ ప్రణాళిక అధికారులు తొలగింపు చర్యలు తీసుకుంటారని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. మంగళవారం వాసవి నగర్‌లో అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్న లే అవుట్, శ్రీనగర్‌లో ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసిన అపార్ట్మెంట్‌లను తనిఖీ చేసి తదుపరి అనుమతులపై సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వెంచర్లు అనుమతి లేకుండా ఏర్పాటు చేస్తే సంబంధిత ప్లానింగ్ కార్యదర్శి, పట్టణ ప్రణాళిక అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వెంచర్ల రోడ్ వైడెనింగ్ పోర్షన్, అంతర్గత రోడ్ల వెడల్పు, ప్లాట్ల కొలతలు, మార్ట్ గేజ్ ప్లాట్లు, యుటిలిటీ ఏరియా, ఎమినిటీస్ ఏరియా, ఓపెన్ స్పేస్, గ్రీనరీ, డ్రైన్ల ఏర్పాటుపై వివరాలు అడిగి తెలుసుకొని నేరుగా తనిఖీ చేశారు. అనంతరం పట్టణ ప్రణాళిక అధికారులతో కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకే వెంచర్లకు అనుమతులు ఇవ్వాలని, తుది అనుమతుల కోసం తమకు పంపే ముందే ప్రణాళిక అధికారులు సదరు వెంచర్ లను సమగ్రంగా పరిశీలించి, ప్రభుత్వ నిర్దేశిత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిబంధనల మేరకు లేని వెంచర్లకు అనుమతులు మంజూరు చేయబోమన్నారు. అనంతరం శ్రీనగర్‌లో ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసుకున్న భవనాన్ని పరిశీలించి, మాట్లాడుతూ నిబంధనల మేరకు మాత్రమే నగరంలో బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు జరగాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. పర్యటనలో సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, డిప్యూటీ సిటీ ప్లానర్ కోటయ్య, టీపీబీఓ రసూల్, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

మూర్ఛ.. నయం చేయవచ్చు ఇక

- ఎపిలెప్సీ బారిన పడుతున్న యువత
- అందుబాటులో ఆధునిక వైద్యసేవలు
- నవంబర్ ఎపిలెప్సీ అవగాహన మాసం



గుంటూరు మెడికల్: ఫిట్స్ వ్యాధికి వైద్యం లేదనే అపోహ చాలా మందిలో ఉంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం 50మిలియన్ల ప్రజలు మూర్ఛ వ్యాధితో (ఎపిలెప్సి) బాధపడుతున్నారు. వీరిలో 80శాతం బాధితులు అభివృద్ధి చెందుతున్న దేశాల్లోనే ఉన్నారు. మన దేశంలో పది మిలియన్ల మంది వ్యాధితో బాధపడుతున్నారు. ప్రజలకు ఫిట్స్ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు ఎపిలెప్సీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2009 నుంచి నవంబర్ నెలను ఎపిలెప్సీ అవగాహన మాసంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం.

మూర్ఛ అనగా ...

మెదడులో ఉన్న న్యూరాన్‌లు విద్యుత్ ఆవేశం ఎక్కువైనప్పుడు బయట కనిపించే లక్షణాలనే ఫిట్స్ లేదా మూర్ఛ అంటారు. ఇది వచ్చినప్పుడు కాళ్లు, చేతులు కొట్టుకుని పడిపోతారు. ఫిట్స్ వచ్చినప్పుడు కొంత మందికి నాలుక కొరుక్కోవడం, నోటి నుంచి నురగ కారడం గమనించవచ్చు. ఫిట్స్ ఎక్కువ సమయం ఉంటే మనిషి దేహం నీలంరంగుగా మారి ప్రాణాపాయ స్థితికి చేరుకోవచ్చు.

కారణాలు...

మెదడులో వచ్చే ఇన్‌ఫెక్షన్లు, గడ్డలు, తలకు గాయాలు, బ్రెయిన్ స్ట్రోక్స్, మెదడులో రక్తనాళాలు ఉబ్బడం, పుట్టుకతో వచ్చే జన్యుపరమైన సమస్యల వల్ల ఫిట్స్ వ్యాధి వచ్చే అవకాశం ఉంది. పిల్లల్లో, పెద్దవాళ్లలో అందరిలోనూ ఈ మూర్ఛవ్యాధి వస్తుంది. గొంతులో, చెవిలో వచ్చే ఇన్‌ఫెక్షన్స్ వల్ల చిన్నారుల్లో వచ్చే అవకాశం ఉంది. స్త్రీలు ప్రసవ సమయంలో కొన్ని రకాల చికిత్స విధానాలు పాటించకపోవడం వల్ల, టీబీ, హెచ్‌ఐవీ, మెదడువాపు జబ్బుల వల్ల వైరస్‌లు, బ్యాక్టీరియా, ఫంగస్‌ల వల్ల ఫిట్స్ కేసులు దేశంలో ఎక్కువగా కనిపిస్తున్నాయి.

జిల్లాలో బాధితులు...

గుంటూరు జీజీహెచ్‌లో ప్రతి శనివారం మూర్ఛ వ్యాధి బాధితుల కోసం ప్రత్యేక ఓపీ ఏర్పాటు చేశారు. ప్రతి వారం 300 మంది ఓపీ విభాగానికి వైద్యంకోసం వస్తున్నారు. జిల్లాలో సుమారు 40 న్యూరాలజీ క్లినిక్‌లు, ఫిజీషియన్ల వద్ద ప్రతిరోజూ 150 మంది వరకు ఫిట్స్ సమస్యతో చికిత్స పొందుతున్నారు. వీరిలో 10 శాతం మంది యువకులే ఉండటంపై వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

డ్రైవింగ్ చేయకూడదు...

ఫిట్స్ వచ్చినప్పుడు రోగి చేతిలో తాళాలు పెట్టటం, నోట్లో నీళ్లు పోయటం, గిల్లటం, కాల్చటం లాంటి పనులు చేయకూడదు. మూర్ఛవచ్చిన వ్యక్తి మెలికలు తిరుగుతూ ఉంటే ఆపకూడదు. రోగి చుట్టూ గుమికూడదు. వ్యక్తి పూర్తిగా కోలుకునేంత వరకు నీళ్లు గాని మరే ఇతర ద్రవపదార్థంగాని ఇవ్వకూడదు. ఫిట్స్ రెండు నుంచి మూడు నిమిషాలుపాటు ఉండి అవే తగ్గిపోతాయి. అంతకు మించి ఎక్కువసేపు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. వ్యాధి ఉన్న వారు స్విమ్మింగ్, డ్రైవింగ్ చేయకూడదు. ప్రమాదకర మెషిన్ల వద్ద పనిచేయవద్దు.

జాగ్రత్తలు తీసుకోవాలి



మూర్ఛకు గురైన వ్యక్తిని నేలపై పడిపోకుండా పట్టుకోవాలి. వ్యక్తి తల కింద మెత్తని పరుపు పెట్టి తలకు దెబ్బతగలకుండా కాపాడాలి. బెల్టు, మెడకున్న టై లేక ఏమైనా బిగుతుగా ఉన్న బట్టలను వదులుగా చేసి, ప్రశాంతంగా ఉండేటట్లు చూడాలి. మూర్ఛఅయిపోయిన తర్వాత శ్వాస ఆడటానికి వీలుగా వ్యక్తిని ఒకపక్కకు పడుకునేలా శరీరాన్ని తిప్పి, నోటిలో నుంచి వచ్చే నురుగను తుడిచివేయాలి. వ్యక్తితో ప్రేమగా మాట్లాడుతూ అతడు పూర్తిగా స్పృహలోకి వచ్చే వరకూ అక్కడే వారితోనే ఉండాలి.

– డాక్టర్ చక్కా శివరామకృష్ణ, సీనియర్ న్యూరాలజిస్టు, గుంటూరు

మూర్ఛవ్యాధి ఉన్నా పెళ్లి చేసుకోవచ్చు



మూర్ఛవ్యాధి ఉన్నా పెళ్లి చేసుకోవచ్చు. ఈ వ్యాధి ఉంటే పెళ్లి చేసుకోకూడదనే అపోహ ప్రజల్లో ఉంది. వ్యాధిని నయంచేసే వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. వ్యాధి ఉన్నప్పటికీసాధారణ పిల్లలుగానే పుడతారు. దీనిపై ఎలాంటి అనుమానాలు పెట్టుకోవద్దు. పిల్లల్లో వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే నరాల వ్యాధి నిపుణులను సంప్రదించటం ద్వారా త్వరితగతిన వ్యాధినుంచి కోలుకునే అవకాశం ఉంది.

– డాక్టర్ పమిడి ముక్కల విజయ, న్యూరాలజిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు, గుంటూరు

ఆపరేషన్‌తో నయం చేయవచ్చు



మూర్ఛవ్యాధిని తగ్గించేందుకు ఫిట్స్ మందులు 70 శాతం వరకు పనిచేస్తాయి. కేవలం 30శాతం మంది ఫిట్స్ బాధితులకు ఎన్ని మందులు వాడినా వ్యాధి తగ్గదు. వారికి వ్యాధిని నయంచేసేందుకు ఆపరేషన్లు అందుబాటులో ఉన్నాయి. ఆపరేషన్‌ల వల్ల నూటికి 90శాతం ఫిట్స్ తిరిగి రావు. మందులు వాడాల్సిన పని కూడా ఉండదు. ఫిట్స్ రోగులకు 'యాంటీరియర్ టెంపరల్ లోబెక్టమి అండ్ ఎమిగ్డలా హిపోక్యాంపెక్టమి' అనే ఆపరేషన్‌లు నేడు అందుబాటులో ఉన్నాయి.

– డాక్టర్ భవనం హనుమ శ్రీనివాసరెడ్డి, న్యూరో సర్జన్, గుంటూరు

ఆటోనగర్ అభివృద్ధికి కృషి


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముస్తఫా, నూరిఫాతిమా

పట్నంబజారు: ఆటోనగర్‌లో వ్యాపారుల సమస్యల పరిష్కారానికి పూర్తి స్థాయిలో కృషి చేస్తామని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా చెప్పారు. మంగళవారం ఆటోనగర్‌లోని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌ను కలిసి పలు సమస్యలపై చర్చించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ ఆటోనగర్ ప్రాంతంలో వ్యాపారులు పలు సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని, వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ముఖ్యంగా సైడు కాల్వలు, రోడ్లు సరిగా లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే ముస్తఫా, నూరిఫాతిమా మాట్లాడుతూ అభివృద్ధి విషయంలో వెనుకడుగు వేసేదేలేదన్నారు. తమ దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. స్థానిక కార్పొరేటర్ పఠాన్ రిహానా, డివిజన్ అధ్యక్షుడు నూర్‌ఖాన్, వైఎస్సార్ సీపీ నేతలు సలీం, మున్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలు పక్కాగా రూపొందించాలి

జేసీ రాజకుమారి

మంగళగిరి: ఓటర్ల జాబితాలను పక్కాగా రూపొందించాలని కార్పొరేషన్ ప్రత్యేక అధికారి, జాయింట్ కలెక్టర్ బి. రాజకుమారి ఆదేశించారు. నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో ఓటర్ల జాబితాలపై అధికారులతో సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో చేర్పులు మార్పులుపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుని ఎలాంటి తప్పులు దొర్లకుండా చూడాలని కోరారు. బీఎల్‌ఓలతో ఎప్పటికప్పుడు జాబితాలపై చర్చించి ఎలాంటి తప్పులు లేకుండా జాబితాలను రూపొందించాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసినప్పుడు ప్రజలందరికి తెలిసేలా ప్రచారం నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రజలు తమ పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించిన సమయంలో తమ ఓటును సరి చూసుకోవడంతో పాటు తప్పులుంటే బీఎల్‌ఓ దృష్టికి తీసుకెళ్లి సరిచేయించుకోవాలని కోరారు. 18 సంవత్సారాలు నిండిన ప్రతి ఒక్కరు తమ ఓటును నమోదు చేసుకోవాలని వివరించారు. ఓటర్ల జాబితాల మార్పులు చేర్పులపై ఎప్పటికప్పుడు ప్రజలకు తెలిసేలా ప్రచారం నిర్వహించడంతో పాటు అవగాహన కల్పించి ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ నిర్మల్ కుమార్, ఎలక్ట్రోరల్ ఆఫీసర్ లక్ష్మీకుమారి, అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్, నగర అడిషనల్ కమిషనర్ కె.హేమామాలిని, డెప్యూటీ కమిషనర్ బి.శివారెడ్డి, మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల తహసీల్దార్లు జీవీ రామ్‌ప్రసాద్, నాగిరెడ్డి, మల్లీశ్వరి పాల్గొన్నారు.


ఘనంగా తెలుగు బాప్టిస్ట్ చర్చి ప్రతిష్టా మహోత్సవం



తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి ముగ్గురోడ్‌లోని తెలుగు బాప్టిస్ట్ చర్చి 12వ తెలుగు బాప్టిస్ట్ చర్చి ప్రతిష్టా మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ రెవ. డేవిడ్ విచ్చేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తాడేపల్లి పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి, గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్‌రాజు, తాడేపల్లి పట్టణ వైఎస్సార్ సీపీ సెల్ అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్ పాల్గొని సంఘస్తులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో తెలుగు బాప్టిస్ట్ సంఘ కాపరి కె.కె.రవికుమార్, సంఘ అధ్యక్షులు రామచంద్రపు జర్సన్, సెక్రటరి దర్శనపు శామ్యూల్, జమ్మలపూడి సుధాకర్, పోగు సాల్మన్, బుర్ర సంసోన్, కురగంటి అనిల్, ధూపాటి బెంజిమన్, సంఘ పెద్దలు బోయిన పల్లి క్రీస్తుదాసు, చిలుక రూబేన్, కటికల యోహాను, జీరా అశోక్ పాల్గొన్నారు.

మేనిఫెస్టోను యథాతథంగా అమలు చేసిన ఏకైక ప్రభుత్వం

- ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్
- 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌రావు


రామిరెడ్డినగర్ సచివాలయంలో లబ్ధిదారుల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించిన ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌రావు, మేయర్ మనోహర్ నాయుడు

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజల సంక్షేమాన్ని కోరుతూ ఇచ్చిన హామీలను ఆచరణలోకి తీసుకురాగల సత్తా కలిగిన నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పకడ్బందీగా రూపొందించిన మేనిఫెస్టోను అమలు చేసిన ఏకైక ప్రభుత్వం మాదే అని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌రావు పేర్కొన్నారు. మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని పశ్చిమ నియోజకవర్గ పరిధిలో 29,38,39వ డివిజన్ల పరిధిలోని రామిరెడ్డినగర్ మెయిన్‌రోడ్డు, గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్, మారుతీనగర్ ఆర్చి ప్రాంతాల్లో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా డివిజన్లలోని వార్డు సచివాలయాల్లో నవరత్నాల లబ్ధిదారులతో ఏర్పాటు చేసిన డిస్‌ప్లే బోర్డులను ప్రారంభించిన ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌రావు, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు వైఎస్సార్ సీపీ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందుతున్న లబ్ధిదారులతో మాట్లాడి, వారి అభిప్రాయాలను తీసుకున్నారు. ఎమ్మెల్యే గిరిధర్ మాట్లాడుతూ చేసిన మేలును సగర్వంగా చెప్పుకునేలా సీఎం వైఎస్ జగన్ తన సుపరిపాలన ద్వారా ప్రజా ప్రతినిధులుగా తమకు గొప్ప అవకాశాన్ని కల్పించారని చెప్పారు. మేనిఫెస్టోలో పెట్టిన అన్ని అంశాలను నూరుశాతం అమలు చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్ అని అన్నారు. ప్రజల్లో ప్రభుత్వానికి వస్తున్న మద్దతును భరించలేక ప్రతిపక్ష నేత చంద్రబాబు, తన అనుచరగణం నిత్యం ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నాలు చేస్తూ, అసత్యాలు పలుకుతున్నారని విమర్శించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో మరింత వేగంగా, పారదర్శకంగా అమలు చేసేవిధంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. కుల, మతాలకు అతీతంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని కాంక్షిస్తున్న వైఎస్ జగన్‌కు ప్రజలు అండగా నిలవాలని కోరారు. చరిత్రలో ఏ నాయకుడు చేయని విధంగా సుదీర్ఘ పాదయాత్ర ద్వారా రెండు కోట్ల మంది ప్రజలను స్వయంగా కలిసి వారి కష్టాలను తెలుసుకొని హామీలన్నింటినీ అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. మేయర్ కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ గతంలో చంద్రబాబు భారీ మేనిఫెస్టో ప్రకటించి, ఏ ఒక్కటీ సక్రమంగా అమలు చేయకుండా చివరకు ఆ మేనిఫెస్టో సైతం కనిపించకుండా చేశారని విమర్శించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందుతున్నవీ, లేనివీ అని అడిగిన ప్రభుత్వం ఈ దేశంలోనే కాదు, ప్రపంచంలోనే ఎక్కడా ఉండదేమో అని అన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోని గుంటూరు నగరంపై ప్రత్యేక శ్రద్ధ చూపించి నిధులు కేటాయిస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. ఆయన దిశ, నిర్దేశం ప్రకారంగా నగరంలోని అన్ని డివిజన్లలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. ఆయా కార్యక్రమాల్లో 38వ డివిజన్ ఇన్‌చార్జ్ బోగిశం ప్రసాద్, 39వ డివిజన్ కార్పొరేటర్ షేక్ జుమ్మాభి మార్కెట్ బాబు, 29వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రోషన్, జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు సురసాని వెంకటరెడ్డి, నూనె ఉమామహేశ్వర రెడ్డి, ఏరువ ఇన్నారెడ్డి, బత్తుల దేవానంద్, ఉడత కృష్ణ, బందా రవీంద్రనాథ్, షేక్ షఫీ, మధు, జుబేర్, కరీముల్లా ఉమర్‌వలీ, కొండబోయిన శ్రీను, ఆచారి, పిల్లుట్ల మోహన్, వెంకట్రావు, బొప్పా రాము, ఇబ్రహీం, సాంబశివరావు, షరీఫ్, కవిత, శ్రీకాంత్, గురవయ్య, రఫీ, కుమార్, సమీర్, శ్రీరాములు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంట కాలువల్లో మురుగునీరు కలవకుండా చర్యలు

కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి


మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

తాడేపల్లిరూరల్: రైతులకు అవసరాలు తీర్చే పంట కాలువల్లో మురుగునీరు కలవకుండా అన్ని శాఖలు కలసి ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి అన్నారు. తాడేపల్లి ఎంటీఎంసీ కార్యాలయంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆర్కే, ఇరిగేషన్, డ్రెయినేజ్, కార్పొరేషన్ అధికారులతో సంయుక్త సమావేశం మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఏ ఏ ప్రాంతాల్లో ఎంటీఎంసీ నుంచి ఇతర ప్రాంతాల నుంచి మురుగునీరు పంటకాలువల్లో కలుస్తోంది అనే విషయాన్ని ఇరిగేషన్, కార్పొరేషన్ అధికారులు సంయుక్తంగా సర్వే చేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం తాడేపల్లి కార్పొరేషన్ నుంచి మురుగునీరు ఎలా మళ్లించాలనే విషయంపై ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, శాసనసభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. తాడేపల్లి పట్టణ పరిధి నుండి మురుగునీటిని బయటకు తరలించాలంటే ఇరిగేషన్ వారు గుంటూరు చానల్‌కు అనుసంధానంగా ఉన్న డ్రైనేజీ కాలువలోకి పంపించాలని సూచించారు. ఆ ప్రక్రియను చేపట్టాలంటే రైల్వే, జాతీయ రహదారుల శాఖల నుంచి అనుమతి పొందాల్సి ఉందని ఎమ్మెల్యే ఆర్కే తెలియజేయడంతో కనకదుర్గ వారధి రేపల్లె కరకట్ట వెంబడి మురుగు నీటిని తరలించే విధంగా కచ్చా డ్రైన్ ఏర్పాటు చేయడం లేని పక్షంలో కార్పొరేషన్, ఇరిగేషన్ డ్రైనేజీ వార్లు చర్చించి అవకాశం ఉన్నచోట మురుగునీటి ట్రీట్‌మెంట్‌ప్లాంట్ ఏర్పాటు చేసేవిధంగా ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన

తాడేపల్లిరూరల్: కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లి మండల విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు మాదక ద్రవ్యాలు, సోషల్ మీడియా దుర్వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ గొళ్ళమూడి శేఖర్‌బాబు మాట్లాడుతూ మత్తు పదార్థాల వలన విద్యార్థులు జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని, సరదాగా అలవాటు చేసుకుని చివరకు వాటిని బానిసలు అవుతున్నారని అన్నారు. తాడేపల్లి మండల విద్యాశాఖ అధికారి శాంత కుమారి మాట్లాడారు. కార్యక్రమంలో నవజీవన్ బాల భవన్ జోనల్ కో ఆర్డినేటర్ బి.రమేష్ పాల్గొన్నారు.

దిశ యాప్‌పై అవగాహన

తాడికొండ: బాలికలు దిశ యాప్‌పై అవగాహన పెంపొందించుకోవాలని తుళ్లూరు సీఐ ఆనందరావు అన్నారు. అంతర్జాతీయ బాలల దినోత్సవాన్ని గుడ్ షెపర్డ్ కాన్వెంట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో తుళ్లూరు ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
(గుంటూరు ఈస్ట్)
90109 57733
Office mail : sakshigntadvt@gmail.com